సంపాదకీయం :

# కారంచేడు : పాతస్మృతులు

కారంచేడు వెళ్లివచ్చినవాళ్లకు తప్పనిసరిగా పాత రోజులు జ్ఞాపకం వస్తాయి. కూలివాళ్ల సంఘాలు, కమ్యూనిస్టు పార్టీలు, కనీసవేతన చట్టాలు, భూపరిమితి శాసనాలు లేనిరోజులు గుర్తుకొస్తాయి. ధర్మం నాలుగుపాదాల మీద నడిచి ఎవరి స్థానాన్ని, ధర్మాన్ని వారు తు. చ. తప్పకుండ ఆదరించిన రోజులు, ఎవరయినా ధిక్కరిస్తే వాళ్లను నిర్దయగా అణిచేసిన ధర్మసంరక్షకులయిన రాజులు ఏలిన రోజులు, ఏరకమయిన హక్కులనూ గుర్తించని పరమకర్కోటకుడు మనువు రాసిన మనుస్మృతే ఏకైక రాజ్యాంగం అయిన రోజులుగుర్తు కొస్తాయి.

ఆ రోజులు గుర్తు కొస్తున్నాయంటే రోజులు అసలే మారలేదని కాదు. మారాయి. ఆనాటి బ్రాహ్మణ ధర్మసూత్రాలు ఏ శూద్రవైతాంగాన్ని అణచడం కోసం ఏర్పడ్డాయో, ఆ శూద్రవైతాంగంలో కొందరు కాలక్రమంలో భూస్వాములయి, తమను తాము సత్‌శూద్రులగా శూద్ర జనసామాన్యం నుండి భిన్నంగా ప్రకటించుకొని ఇప్పుడు బ్రాహ్మణ ధర్మసూత్రాలను బ్రాహ్మణులతో సమానంగా కూలిజనం మీద అమలుచేస్తున్నారు. మరీ తెగబడ్డ వాళ్ళు చారిత్రక ఔచిత్యాన్ని సహితం మరచిపోయి ముఖంమీద ఇంతింత బొట్లు పెట్టుకొని హిందూ ధర్మసంరక్షణం చేస్తామంటూ ఈ మధ్యకాలంలో ఊరేగింపులు తీస్తున్నారు. అందుకే ఇది కులం తగాదా కాదు, భూమి తగాదా అంటున్నాము.

కూతురు పెళ్లికోసమయినా ఏ ఇతరవైదిక సంస్కారం కోసమయినా ఖర్చులు అవసరమయితే శూద్రులనుండి మోసంతోనో బలప్రయోగంతోనో తీసుకోవచ్చునని గౌతముడనే స్మృతికర్త అన్నాడు.

ఇప్పుడే ఫలానా అవసరం లేకపోతే భవిష్యత్తులో రాకపోతుందా! అందుకని వస్తురూపంలో డబ్బురూపంలో శ్రమ రూపంలో ఏరోజుకారోజు రివాజుగా పేకరించడం భూస్వాములు అలవాటు చేసుకున్నారు. సంస్కృతంలో దీనిని విష్టిఅని, తెలుగులో వెట్టి అని, ఉరుదులో బేగార్ అనీ అంటారు. కారంచేడులో పొలాన్ని పాలికి తీసుకున్న హరిజనులు పంటలో మూడింట రెండు వంతులు భూస్వామి పాలు చెల్లించడమే కాక, భూస్వామి ఇంట్లోనూ పొలంలోనూ చేయమన్న చాకిరీ చేయాలట. పాలేరేకాక అతని భార్యకూడ వెట్టికి పశువులను కడగడం నుండి చిన్నపిల్లల అశుద్ధాన్ని శుభ్రం చేయడం దాకా అన్ని పనులూ చేయాలట.

P.T.O.

పనిచేస్తానని ఒప్పుకున్న కూలివాడు ఏకారణంగానయినా పనిపూర్తిచేయక వది లేస్తే అతన్ని భౌతికంగా దండించాలని ఆపస్తంబుడనే స్మృతికర్త అన్నాడు. అంతే కాక, అనారోగ్య కారణం వల్లనయినాసరే పని మధ్యలో మానేసి తిరిగి పనిలోకివచ్చి గూడ పూర్తిచేయకపోతే, చేసిన సగంపనికిగూడ జీతం ఇయ్య వలసిన అవసరం లేదని మనుస్మృతికారుడు స్వయంగా అన్నాడు.

కారంచేడులో పాలేర్లు ఒక్కరోజుపనిలోకి పోలేకపోతే భూస్వాములు సాయం కాలం స్వయంగా ఇంటికొచ్చి కొట్టి పోతారంట. పిల్లి సుబ్బారావు అనే యువకుడు ఒక భూస్వామి దగ్గర పాలేరుగా పనిచేస్తూ ఒక్కనాడు పనిలోకి పోనందుకు సాయం త్రం ఇంటికొచ్చి సుబ్బారావులేకుంటే అతని రోగిష్టి భార్య అంకమ్మను కొట్టిపోయా రట. పాలేరుగా ఒప్పుకున్నవాడు 11నెలలు పనిచేసి మానేస్తే, 11నెలలు కాదు, ఒక్క నెల జీతంగూడ ఇవ్వరంట. 'పంట మొత్తం సురక్షితంగా భూస్వామి యింటికి చేర్చే దాకా పాలేరుకు జీతం ముడుతుందన్న నమ్మకంలేదు' అని హరిజనులు వాపోతు న్నారు.

ఈ ధర్మ సూత్రాలకుతోడు, పాలేర్లకు కేవలం 2000 రూపాయలు సంవత్సర జీతం, దినకూలీ ఆడవాళ్లకు 6రూపాయలు, మగవాళ్లకు 10రూపాయలు మాత్రమే ఇస్తుంటే కూలిజనం కనీసవేతనాల చట్టం అమలును సమీక్షించాల్సిన తాసీల్దారు దగ్గరో, కలెక్టరు దగ్గరో ఫిర్యాదు చేసుకోరా?

కోర్టులలో వ్యాజ్యాలు నడిపే అర్హత కేవలం వైదిక సంస్కారాలు పాటించే వారికే (అంటే అగ్రవర్ణాలకే) ఉందని బృహస్పతి అనే స్మృతి కర్త అన్నాడు. ఏ వర్ణానికి చెందిన వాళ్లు ఆ వర్ణం వాళ్ళ మీదే తప్ప తమకంటె ఉన్నతుల మీద సాక్ష్యం ఇవ్వడానికి వీలులేదని వశిష్టుడనే శాస్త్రకారుడన్నాడు. చాలా సింపుల్‌గా ఇదే విష యాన్ని కౌటిల్యుడు ఈ విధంగా చెప్పాడు. భృత్యుడు అయినవాడు సివిల్ దావాలలో తన యజమానికి వ్యతిరేకంగా సాక్ష్యం ఇవ్వడానికి వీలులేదన్నాడు.

కారంచేడు హరిజనులకు ఈ సూత్రం ఎవరు చెప్పారో తెలియదు గాని వాళ్లు తమ వేతనాల గురించి ఫిర్యాదు చేయడానికి ప్రయత్నం చేసినట్టు గూడ లేదు. అసలు తమకు ఇస్తున్నది కనీసవేతనం కంటె తక్కువ అని గూడ వాళ్ళకు తెలిసినట్టు లేదు. వాళ్ళకేకాదు, ఆ విషయం జిల్లా కలెక్టరుకు గూడ తెలీదు. ఒక పత్రికావిలేఖరి, కారం

చేడులో కూలిరేట్లు ఏ మాత్రం ఇస్తున్నారని ఆయనను అడిగితే 'అన్నిచోట్లా ఎంతిస్తారో అంతే ఇస్తారుకాబోలు, నాకుమాత్రం ఏం తెలుసు?' అని బదులు చెప్పి, పక్కనే వున్న పోలీసు డి ఐ.జి. గారిని అడగమన్నాడంట.

ఫిర్యాదు చేయకపోతేమానె, అప్పుడప్పుడయినా తిరగబడరా? సంఘటితంగా పోరాడకున్నా మాటకు మాట తిట్టుకు తిట్టు దెబ్బకు దెబ్బ బదులివ్వరా?

అగ్రవర్ణాలవారిని శూద్రులు తూలనాడితే నాలుక తెగగోయమని ఆపస్తంబుడన్నాడు. అక్కడితో ఆగకుండ పది అంగుళాలు పొడవున్న ఇనుప మేకును ఎర్రగా కాల్చి నోట్లోకి దూర్చాలని మనువు అన్నాడు. చెయ్యిఎత్తితే చెయ్యి తెగగొట్టమన్నాడు, ఉమ్మివేస్తే పెదిమెలు తెగనరకమన్నాడు.

జులై 17నాడు కారంచేడు భూస్వాముల యువకిశోరాలు సరిగ్గా శాస్త్రప్రకారం ప్రవర్తించారు. తేళ్ళసువార్త అనే మాదిగస్త్రీ, 'తాగేనీటి చెరువులోకి బర్రెకుపెట్టేకుడితి నీళ్ళు ఎందుకు పోస్తున్నావని అడిగింది. మాటా మాటా పెరిగి ఆమెను చంద్రకోలుతో కొడితే దాన్ని లాక్కొని తానూ ఒక దెబ్బవేసింది. హిందూ ధర్మసూత్రాలుగాని, 'ఒక చెంపన కొడితే రెండవ చెంప చూపించమ'నే తమ క్రైస్తవ మత సూక్తిగాని, ఆమెను ఆపలేదు. ఈ అధర్మవర్తనకు ప్రతీకారం మరుసటిరోజు 3000 మంది గొడ్డళ్ళతో బరిసెలతో కర్రలతో మాదిగ వాడమీద దాడిచేసి 6గురు మగవాళ్ళను చంపి ముగ్గురు స్త్రీలమీద అత్యాచారం చేసారు. చాలా క్రూరంగా ప్రవర్తించారు. గొడ్డళ్ళతో నరికి కింద పడేసి పొత్తికడుపులోకి బరిసెలు దించి తిప్పారు. స్త్రీలపై అత్యాచారం చేసి పొత్తికడుపు కింద కర్రలతో పొడిచారు. నిజానికి వాళ్ళకోపం ప్రధానంగా వోట్ల గురించికాదు. సువార్తలాంటి యువకులు పొలంలోనూ గ్రామంలోనూ ఒక రెండేళ్ళగా మాటకుమాట ఎదురుచెప్తున్నారని.

ఇంతకీ ఈ దుర్మార్గులను శిక్షిస్తారా? కారంచేడు ఎన్టీఆర్ బంధువుల గ్రామం కాబట్టి కాంగ్రెస్ (ఐ)వాళ్ళు పెద్ద ఎత్తున గొడవ చేస్తున్నారు. హరిజనులను చంపే హక్కు తమకుమాత్రమే వుందని వాళ్ళ అహంభావం. ఇంతగొడవ జరుగుతున్నా 3000 మంది చేసిన దాడికి అరెస్టులు 30దాటలేదు. నిజానికి ఇంత గొడవ జరుగుతోంది కాబట్టి ఈ మాత్రమయినా జరిగాయి. సి.బి.సిఐడి దర్యాప్తు గూడ జరుగుతోంది. న్యాయవిచారణ ప్రకటించారు. కాని న్యాయం జరుగుతుందా?

P-T-O

కాకినిగాని కుక్కనుగాని గుడ్లగూబనుగాని కప్పనుగాని చంపితే ఎంతపాపమో శూద్రుడిని చంపితే అంతేపాపం అని ఆపస్తంబుడేకాదు, బౌధాయనుడు, మనువు, గౌతముడు గూడ అన్నారు. అగ్రవర్ణాలవారిని చంపితే నష్టపరిహారం (శిక్షకాక) 1000 గోవులు చెల్లించాలి, శూద్రుడిని చంపితే 10 గోవులిస్తే చాలునని ఆపస్తంబుడూ గౌతముడూ అన్నారు. ఇంతెందుకు, ఈ ధర్మశాస్త్రకారులకంటే చాలాపూర్వం, ఐతరేయ బ్రాహ్మణంలో, శూద్రులను ఇష్టానుసారం చంపవచ్చునని (వారు 'యధాకాను వధ్యులు' అని) అన్నారు.

16 ఏళ్ళక్రితం కాబోలు తంజావూరు జిల్లాలోని కిలివెన్మణి గ్రామంలో ఒక ముదలియార్ మిరాస్దార్ మనుషులు హరిజనులను సజీవదహనానికి గురిచేశారు. దేశమంతా గగ్గోలు పెట్టింది. కాని కోర్టు ఆ మిరాస్దార్‌ను విడిచిపెట్టింది. 'ఇంతపెద్ద మనిషి అంత నీచపుపనిచేస్తాడని నమ్మలేకుండా వున్నాం' అని ప్రకటించి మరీ విడిచి పెట్టింది. కారంచేడు కేసు అంతకంటె భిన్నంగా నడుస్తుందా?

హంతకులు కొందరు గ్రామంలోనూ కొందరు హైదరాబాద్ తదితర పట్టణాలలోనూ సురక్షితంగా వున్నారు. తమంతట తాము పోలీసుల కళ్ళబడ్డ వాళ్ళను అరెస్టు చేస్తున్నారుతప్ప, ఇళ్ళను సోదాచేయడం, బంధుమిత్రులను ఇంటరాగేట్ చేయడం, లాంటి పనులేవీ మొదటి వారంరోజులు పోలీసులు చేయలేదు. ఇదే కూలివాళ్లు భూస్వాముల ఇళ్ళ మీద దాడి చేసివుంటే (ఆరు హత్యలూ మూడు మానభంగాలూ అటుంచి) ఎంత భీభత్సం జరిగివుండేది? మొత్తం మాలమాదిగ వాడ అంతా చీరాల పోలీస్‌స్టేషన్‌లో ఉండేది కాదా? మాలమాదిగా యువకులందరి మీదా ఉమ్మడిగా కుట్ర కేసు పెట్టివుండేవారు కాదా? తెలంగాణ జిల్లాలను ఇందుకేకాదూ పోలీసు క్యాంపుగా మార్చేసి 'ఎన్‌కౌంటర్లు' చేసి ఇప్పుడు టెర్రరిస్టు ప్రాంతంగా ప్రకటించబోతున్నారు? ఇక్కడ ఇంత భీభత్సం సృష్టిస్తున్న అన్నగారు కారంచేడు హరిజనులకు మాత్రం 'జరిగిందేదో జరిగింది, మరచిపోయి సామరస్యంగా జీవించడ'ని నీతులు చెబుతున్నాడు.

కాని ఒకటి మాత్రం ఈ హంతకులూ, వారి అన్నగారు గుర్తుంచుకుంటేమంచిది. ఎన్నిధర్మసూత్రాలు వల్లించినా శ్రామిక జనం ఆనాడు తిరుగుబాట్లు చేయక మానలేదు. ఈనాడు గూడ చేయక మానరు. వాళ్లు అసంఘటితంగా వున్నచోట వాళ్ళను హత్యాకాండకు గురిచేస్తూ వాళ్ళు సంఘటితమయితే టెర్రరిజం అంటూ, ఎల్లకాలం పరిపాలించలేరు. ఈ విషయం పాలకవర్గాలు గుర్తుంచుకుంటే అది తమకే మంచిది.

కె. బాలగోపాల్

ముద్రణ: సృజన జూన్ – సెప్టెంబరు 1985
పునర్ముద్రణ: సృజన సంపాదకీయాలు (1966–1985)
విరసం ప్రచురణ జనవరి 1990